సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 7 | మార్చి | 2024



అన్నదానానికి రూ.లక్ష విరాళం

సామర్లకోట: స్థానిక కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి యాల్ల వెంకట పనస సత్యప్రసాద్, పద్మజ (కాకినాడ) రూ.లక్ష విరాళం అందజేశారు.



వాహనం.. సమ్మోహనం..

దేవుళ్ల పెళ్లికి దేవలందరూ పెద్దలుగా వస్తారని ప్రతీతి. అందుకే కల్యాణ మహోత్సవాల సమయంలో దేవుళ్లను దర్శించుకోవడానికి భక్తులు అధికంగా తరలివస్తారు.

8లో

కాలువలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 9.10 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

అన్నదాన భవనానికి రూ.10 లక్షల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి తణుకు పట్టణానికి చెందిన నార్కెడమిల్లి రామకృష్ణమూర్తి, కుటుంబ సభ్యులు బుధవారం రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. దాతకు ఆలయ అర్చకుల చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశామన్నారు.

ఫ్లడ్ లైట్ల వెలుగులో సీసీఎల్ క్రికెట్ టోర్నీ



సీసీఎల్ పోటీలను ప్రారంభిస్తున్న అమలాపురం ప్రముఖులు

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీచెన్న మల్లేశ్వర కళా పరిషత్ గ్రౌండ్స్‌లో చెన్నమల్లేశ్వర క్రికెట్ లీగ్ (సీసీఎల్) పోటీలు తొలిసారిగా ఫ్లడ్ లైట్ వెలుగుల్లో మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. నైట్ క్రికెట్ పోటీలను వీక్షించేందుకు కోనసీమ వ్యాప్తంగా క్రీడాభిమానులు తరలివచ్చారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 30 టీములు తలపడుతున్నాయి. పట్టణానికి చెందిన పేరాబత్తుల ఫణి, ఉద్దిశ కిషోర్, నల్లా సాయి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. పట్టణ ప్రముఖులు నల్లా శ్రీధర్, దున్నాల దుర్గ, ముచ్చెర్ల రెడ్డినాయుడు, ఏడిద శ్రీను, కల్వకొలను బాబి, నల్లా చిట్టిబాబు, ఉద్దిశ చిన్నా, పిండి రాజా, నల్లా మల్లిబాబు, చంద్రమౌళి సత్యనారాయణ తదితరులు రిబ్బన్ కట్ చేసి సీసీఎల్ పోటీలను ప్రారంభించారు.

నేడు అన్నవరం ఆలయ ట్రస్ట్‌బోర్డు సమావేశం

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొంటారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఏప్రిల్ 15 వ తేదీ వరకు జరగనున్న సత్యదేవుని నూతన స్వర్ణ ధ్వజస్తంభం ప్రతిష్ఠ ఏర్పాట్లు, మే నెల 18 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల ఏర్పాట్లపై సమావేశంలో చర్చించనున్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- భరోసా ఇస్తున్న సీఎం జగన్
- మిచాంగ్ తుపాన్ ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల
- జిల్లాలో 23,379 మంది రైతులకు రూ.20.25 కోట్ల లబ్ధి

సాక్షి అమలాపురం: అనేక సంక్షేమ పథకాలతో వ్యవసాయాన్ని పండగలా మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారు. విత్తు నుంచి విక్రయం వరకూ, ఆపద వస్తే తోడుగా అడుగులు వేస్తున్నారు. రైతుకు కష్టం వచ్చిన ప్రతిసారి నేనున్నాంటూ భరోసా కల్పిస్తున్నారు. మిచాంగ్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు అండగా నిలిచారు. తుపాను కారణంగా సంభవించిన పంట నష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ నష్ట పరిహారం నిధులను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వర్చువల్ విధానంలో బటన్ నొక్కి రైతులు బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు.



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ నూపుర్ అజయ్ తదితరులు

ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.20.25 కోట్లు

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖలు బృందాలుగా ఏర్పడి పంట నష్టం వివరాలు నమోదు చేశాయి. ఆర్బీకేల పరిధిలో పంట నష్టం వివరాలు, రైతులు, కౌలు రైతుల జాబితాలను ప్రదర్శించి, సామాజిక తనిఖీ పూర్తి చేశాయి. జిల్లాలో తుపాన్ ప్రభావంతో 23,379 మంది రైతులకు చెందిన 11,668.77 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఇందుకుగాను ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.20.25 కోట్లను ప్రభుత్వం అందజేసింది. వరి పంటకు సంబంధించి 19,849 మంది రైతులకు చెందిన 10,503 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతినగా, ఇందుకు రూ.17.85 కోట్లు నష్టపరిహారం అందించారు. ఉద్యాన పంటలకు సంబంధించి 3,530 మంది రైతులకు చెందిన 1,164 హెక్టార్ల పంటలు దెబ్బతినగా, ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.2.39 లక్షలు పెట్టుబడి రాయితీగా అందనుంది.

అన్నదాతలకు అండగా..

అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్ అన్నారు. మిచాంగ్ తుపాను ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రతి రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం ఉపశమనం కలిగించిందన్నారు. అన్ని విధాలా బాసటగా నిలుస్తూ వెన్నుతట్టి, ధైర్యాన్ని నింపుతోందన్నారు. ఈ–క్రాప్ బుకింగ్, రైతు భరోసా, వైఎస్సార్ పంటల బీమా వంటి విప్లవాత్మక కార్యక్రమాలను ప్రవేశపెట్టి, నూతన ఒరవడికి నాంది పలికి, రైతు పక్షపాతిగా నిలిచిందన్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఏ సీజన్లో జరిగిన నష్టానికి అదే సీజన్‌లో పరిహారం చేతికి అందేలా చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు, వెంకట రామారావు, హితకారిణి సమాజం చైర్మన్ కాశీ బాల మునికుమారి, పురపాలక సంఘ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, రైతులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ఆలయానికి రూ.మూడు లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత పాపారావు

ఆలమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో నిర్మిస్తున్న శ్రీకృష్ణుని ఆలయానికి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు రూ.మూడు లక్షల విరాళం అందించారు. ఆలయాన్ని నిర్మిస్తున్న యాదవ సంఘానికి బుధవారం ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతను యాదవ సంఘం ఘనంగా సత్కరించింది. దాతల సహకారంతో నిర్మిస్తున్న ఈ ఆలయాన్ని వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపింది.

గరుడేశ్వరస్వామికి ఆభరణాల సమర్పణ



వెండి జటాఝూటం అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు

పి.గన్నవరం: గ్రామంలో కొలువైన బాలా త్రిపుర సుందరీ సమేత గరుడేశ్వరస్వామికి గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు రూ.1.7 లక్షలతో కొనుగోలు చేసిన వెండి జటాఝూటం, నాగాభరణాలను బుధవారం సమర్పించారు. వీటిని ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద రాజు, అర్చక స్వామి భైరవబొట్ల సత్య వెంకట నారాయణమూర్తికి అందించారు. వీటికి గురువారం ఆలయంలో సంప్రోక్షణ చేసి, శివరాత్రి సందర్భంగా స్వామి వారికి అలంకరించనున్నారు.

రాష్ట్రంలో నిరంతరాయంగా అభివృద్ధి

- మంత్రి విశ్వరూప్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

మామిడికుదురు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిరంతరాయంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రూ.1.41 కోట్లతో నిర్మించిన పాశర్లపూడిలంక – ఆదుర్రు సిమెంట్ కాంక్రీట్ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. అలాగే రూ.1.01 కోట్లతో వాద్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నిర్మించనున్న హిమాన్షు శుక్లా రామసేతు వారధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుతో కలసి ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. వాటి శిలాఫలకాలను ఆవిష్కరించారు. బి.దొడ్డవరం నుంచి అప్పనపల్లి వరకు రూ.84 లక్షలతో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డును ప్రారంభించారు.



హిమాన్షు శుక్లా వారధి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీకి దక్కుతుందన్నారు. చేసిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎన్నికల్లో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజ కుమారి, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాస్, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, కొనుకు ప్రేమజ్యోతి, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు నామన వెంకటేశ్వరరావు, చెరుకూరి పార్వతీదేవి, వాసంశెట్టి వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, నాయకులు బాలం రమేష్, అడబాల చక్రపాణి, కేదారిశెట్టి మల్లి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రెండు వేల వ్రతాల నిర్వహణ
- అన్ని విభాగాల ద్వారా రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం బుధవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం కావడంతో ఉదయం నుంచి భక్తులు సత్యదేవుని ఆలయానికి పోటెత్తారు. వీరంతా సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లైన్లు, వ్రత మంటపాలు, విశ్రాంత మంటపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

ఘనంగా సత్యదేవునికి ఏకాదశి పూజలు

ఏకాదశి పర్వదినం సందర్భంగా రత్నగిరి సత్యదేవునికి ఘనంగా పూజలు చేశారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. తరువాత ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు సహస్ర పుష్పార్చన నిర్వహించారు. అనంతరం స్వామివారికి పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

నేడు ‘ప్రసాద్’ పనులకు శ్రీకారం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో మరో కీలక అంకానికి గురువారం శ్రీకారం చుట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రముఖ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేసేందుకు పిలిగ్రిమేజ్ రీజువెనేషన్ అండ్ స్పిరిట్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీం కింద దేవస్థానానికి రూ.20.06 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టే నిర్మాణ పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా గురువారం ప్రారంభించనున్నారు. పాత టీటీడీ సత్రం స్థలంలో రెండంతస్తుల అన్నదాన భవనం, ప్రస్తుత అన్నదాన భవనం వద్ద క్యూ కాంప్లెక్స్, ప్రకాష్ సదన్ వెనుక గల పార్కింగ్ ప్రదేశంలో టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఉదయం 11 గంటలకు సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం వద్ద జరిగే ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీత, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని దేవస్థానం అధికారులు తెలిపారు.



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

వైఎస్సార్, జగన్ పాలనలో కాపులకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- వైఎస్సార్ సీపీలో 110 కుటుంబాల చేరిక

కొత్తపేట: రాష్ట్రంలో కాపు సామాజిక వర్గానికి నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ, జనసేన పొత్తులో నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిత్వాన్ని జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసరావుకు కాకుండా, టీడీపీ ఇన్‌చార్జి బండారు సత్యానందరావుకు కేటాయించడాన్ని నిరసిస్తూ వానపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, గ్రామ జనసేన అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన నాయకత్వంలో జనసేన కార్యకర్తలతో పాటు టీడీపీ అసమ్మతి కార్యకర్తలు ఆయా పార్టీలను వీడారు. వివిధ సంక్షేమ పథకాలతో పాటు అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ, అందరికీ సమన్యాయం చేస్తున్న వైఎస్సార్ సీపీ పాలనకు ఆకర్షితులయ్యారు. ఆ మేరకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని తమ గ్రామానికి సాదరంగా ఆహ్వానించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మాజీ ఉప సర్పంచ్ బండారు శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన నాయకులు బండారు అయ్యప్ప నాయుడు, బండారు పళ్లంరాజు, బండారు సూర్యనారాయణ, డేగల కాశీ, సాపిరెడ్డి వెంకటేశ్వరరావు, కుంచనపల్లి వీరభద్రరావు, మెండుగుదిటి రామారావు, కోలా సర్వేశ్వరరావు, వేళ్ల కాశీ, బండారు లక్ష్మణరావు, మెండుగుదిటి గణపతి, గనిశెట్టి పళ్లంరాజు, ఉంగరాల ప్రసాద్, చిక్కం సూర్యనారాయణ, వడ్లమూడి సత్యనారాయణ, కుప్పాల సర్వేశ్వరరావు, మిండిగుదిటి సుబ్బారావు, గొలకోటి వెంకటేశ్వరరావు, భావన వీరభద్రరావు తదితర సుమారు 110 కుటుంబాల వారికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాకా జానకి రామరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, యువజన విభాగం సభ్యుడు ఇసుకపట్ల సునీల్ పాల్గొన్నారు.

మావయ్య కానుక.. ఏటేటా ఠంఛన్‌గా..

- పాఠశాలల పునఃప్రారంభానికి ముందే జేవీకే కిట్ల పంపిణీ
- విద్యార్థులకు ఏడు వస్తువులు అందజేత
- చదువుకు సీఎం జగన్ ప్రాధాన్యం

రాయవరం: విద్యపై ఎంత వెచ్చించినా అది భవిష్యత్తుకు పెట్టుబడి అవుతుందన్నది సుస్పష్టం. సమాజంలో అసమానతలను చదువుతోనే రూపుమాపగలమని, విద్యతోనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్మారు. అదే నమ్మకాన్ని ఆచరణలో చూపించి, విద్యారంగానికి పెద్ద పీట వేస్తున్నారు. పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏటా బడులు తెరిచే రోజే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందిస్తోంది. నాలుగేళ్లుగా ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేసింది.

నాణ్యతకు పెద్దపీట

జగనన్న విద్యాకానుక కిట్ల విషయంలో ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలకు పెద్ద పీట వేస్తోంది. కిట్‌లో స్కూల్ బ్యాగ్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్ట్, డిక్షనరీని విద్యార్థులకు అందజేస్తున్నారు. 1 – 5 తరగతుల చదివే బాలికలకు, 1 – 10 తరగతులు చదివే బాలురకు బెల్ట్‌లు అందజేస్తున్నారు. 6 – 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, 1 – 6 తరగతుల విద్యార్థులకు పిక్టోరియల్, 7 – 10 విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందిస్తున్నారు. జగనన్న కిట్లలో వస్తువుల నాణ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు అందజేస్తున్నారు.



పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్‌తో విద్యార్థులు (ఫైల్)

బయోమెట్రిక్ విధానం

జగనన్న విద్యాకానుక కిట్లు పక్కదారి పట్టకుండా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. మండల స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు చేరుకున్న అనంతరం కిట్లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న చేరికలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఐదు శాతం కిట్లు అదనంగా అందజేస్తున్నారు. ప్రతి విద్యార్థి లేదా తల్లిదండ్రుల బయోమెట్రిక్ ఆధారంగా కిట్లు పంపిణీ చేయడంతో కిట్లు పక్కదారి పట్టే అవకాశం లేకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. జేవీకే కిట్ ద్వారా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, మూడు జతల యూనిఫాం, బూట్లు, సాక్సులు, స్కూల్ బ్యాగ్, బెల్ట్, పిక్టోరియల్ డిక్షనరీలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ!

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకు నాలుగు విడతలుగా (2020, 21, 22, 23) జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 1,839 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి వరకూ 1,14,883 మంది విద్యార్థులకు వీటిని అందించారు. ప్రభుత్వం ఒక్కో కిట్‌లోని సామగ్రికి రూ.2,419 ఖర్చు చేసింది. దీని ప్రకారం 1,14,883 మంది విద్యార్థులకు రూ.27,77,81,027 వెచ్చించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని విద్యార్థులకు 8,53,289 పాఠ్య పుస్తకాలు, 1,83,677 వర్క్‌బుక్స్, 7,25,602 నోట్‌బుక్స్, 79,864 మందికి బెల్టులు, 1,14,833 మందికి యూనిఫాం, స్కూల్ బ్యాగ్‌లు, 1,14,577 షూస్, 7,308 మందికి పిక్టోరియల్ డిక్షనరీలు, 12,980 మందికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందించారు.

ప్రతి విద్యార్థికి అందజేశాం



జగనన్న విద్యాకానుక కిట్లు ప్రతి విద్యార్థికి చేరవేశాం. జిల్లా వ్యాప్తంగా మండల స్టాక్ పాయింట్ల నుంచి పాఠశాలలకు జేవీకే కిట్లు సరఫరా పక్కాగా చేపట్టాం. ప్రతి దశలోనూ నాణ్యతను తనిఖీ చేశాం. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులందరికీ జేవీకే కిట్ల పంపిణీ జరిగింది.

– బీవీవీ సుబ్రహ్మణ్యం, సీఎంవో, అమలాపురం

ప్రభుత్వం ముందు చూపు



విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం జేవీకే ఇండెంట్‌ను తీసుకుంది. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జేవీకే కానుకలను పంపిణీ చేసింది. ప్రతి పేదవాడు చదువుకోవాలనే ప్రభుత్వ లక్ష్యం జేవీకేతో సాధ్యమవుతుంది. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది.

– ఎం.కమల కుమారి, డీఈవో, అమలాపురం

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.82 కోట్లు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా గత 34 రోజులకు గాను రికార్డు స్థాయిలో రూ.1,82,53,964 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను బుధవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,76,78,844 కాగా, చిల్లర నాణేలు రూ.5,75,120 వచ్చాయని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు. వీటితో బాటు బంగారం 19 గ్రాములు, వెండి 1,580 గ్రాములు వచ్చిందని తెలిపారు. స్వామివారి దర్శనానికి భక్తులు ఎక్కువగా విచ్చేసే మాఘమాసం, దానికితోడు 20 రోజులుగా రత్నగిరిపై జోరుగా వివాహాలు జరుగుతుండడం, ఇతర ప్రాంతాలలో వివాహాలు చేసుకున్నవారు కూడా పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి రావడంతో ఆదాయం పెరిగింది. రికార్డు స్థాయిలో రోజుకు సరాసరిన రూ.5,07,054 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.



సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని: స్థానిక రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నవరం – హంసవరం మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని సుమారు 42 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ జి.మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. పట్టాలు దాటుతున్న అతడిని గుర్తు తెలియని గూడ్స్ రైలు ఢీకొన్నట్టు భావిస్తున్నామన్నారు. అతడి ఒంటిపై నలుపు టీషర్ట్, బ్లూ జీన్ ప్యాంట్ ఉందని, కుడి చేతిపై ఐలవ్ యూ సింబల్, కిశోర్ నిర్మల అనే పచ్చబొట్టు ఉన్నాయన్నారు.

గడ్డి మందు తాగిన యువకుడి మృతి

రాజానగరం: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని స్థానిక పోలీసులు తెలిపారు. మండలంలోని పల్ల కడియానికి చెందిన వక్కాల వీరబాబు (20) తాగుడుకు బానిసై, జులాయిగా తిరుగుతుండేవాడు. తాను అడిగిన వెంటనే తల్లి మద్యానికి సొమ్ములు ఇవ్వలేదనే కోపంతో జనవరి 30న గడ్డి మందు తాగాడు. వెంటనే అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుండి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని స్థానిక హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

మహిళను రక్షించిన రైల్వే పోలీసులు



మేరీని భర్త రమణకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

తుని: ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన మహిళను రైల్వే పోలీసులు రక్షించారు. స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రత్నయపేటకు చెందిన ముక్తి మేరీ (38) బుధవారం భర్తతో గొడవపడింది. తన పెద్ద కుమారుడితో కలిసి తుని రైల్వేస్టేషన్‌కు వచ్చింది. అక్కడ ప్లాట్‌ఫాం చివరలో ఆత్మహత్యకు పాల్పడుతున్న ఆమెను డ్యూటీ కానిస్టేబుల్ గణేష్ అడ్డుకుని రైల్వే పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆమె భర్త రమణను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మేరీని అప్పగించారు.

వాహనం.. సమ్మోహనం..

- కుక్కుటేశ్వరస్వామిని ఊరేగించే వాహనాలకు ఎంతో చరిత్ర
- సప్తనారీ హంస వాహనం పాదగయ క్షేత్రానికి ప్రత్యేకం



సుబ్రహ్మణ్యశర్మ ఘనపాఠి

పిఠాపురం: దేవుళ్ల పెళ్లికి దేవలందరూ పెద్దలుగా వస్తారని ప్రతీతి. అందుకే కల్యాణ మహోత్సవాల సమయంలో దేవుళ్లను దర్శించుకోవడానికి భక్తులు అధికంగా తరలివస్తారు. అలాగే అన్ని పర్వదినాలలో ఆ దేవుడు భక్తులను అనుగ్రహించడానికి గ్రామోత్సవాల రూపంలో పురవీధుల్లో విహరిస్తారు. నలుగురు బోయీలు వివిధ వాహనాలపై దేవుడిని మోసుకొస్తుంటే జనాలు చూసి తరిస్తారు. అయితే దేవుళ్లను ఊరేగించే వాహనాలకు ఎంతో చరిత్ర, విశిష్టత ఉంటుంది. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయంతో పాటు అన్ని శివాలయాల్లోనూ ప్రతి రోజు పరమశివుడు వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు. మహా శివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఆయా వాహనాల పరమార్థాన్ని ప్రముఖ వేద పండితుడు బ్రహ్మశ్రీ ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనపాఠి వివరించారు. ప్రపంచంలో ఏ ఆలయంలోనూ ఏ దేవుడికి లేని సప్తనారీ హంస వాహనం ఒక్క పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి వారికి మాత్రమే ఉందన్నారు. వందల ఏళ్లుగా ఈ వాహనంపై స్వామివారు ఊరేగుతున్నట్లు తెలిపారు.



గజవాహనం



నంది వాహనం



భూత వాహనం

గజ వాహనం

అమృతం కోసం క్షీర సాగర మథనం చేస్తున్న సమయంలో రెండు రెక్కలు, నాలుగు దంతాలతో ఒక ఐరావతం (ఏనుగు) ప్రత్యక్షమైంది. ఆ ఐరావతాన్ని పరమశివుడు అధిరోహించడంతో పాటు అనుగ్రహించడంతో ఆ రూపంలో ఉండే వాహనంపై స్వామివారిని పర్వదినాలలో ఊరేగిస్తుంటారు.

నంది వాహనం

పరమశివుడి అనుగ్రహం కోసం నందీశ్వరుడు విశేష తపసు చేయగా ఆయనకు శివుడు నిత్య శివ సాన్నిధ్యాన్ని ప్రసాదించాడు. ఈ వాహనంపై స్వామివారిని దర్శిస్తే సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

భూత వాహనం

త్రేతాయుగంలో రావణ బ్రహ్మ శివుని కటాక్షం కోసం ఘోర తపసు చేశాడు. దానికి మెచ్చిన మహాశివుడు ఆయనకు ప్రమద గణాధిపతులలో మహాబలుడు అనే పేరుతో నిత్య కైలాస నివాసాన్ని ప్రసాదించాడు. ఈ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే ధైర్యాన్ని ప్రసాదిస్తాడు.

ద్వాదశ స్తంభ వాహనం

ద్వాదశ జ్యోతిర్లింగాలుగా వెలసిన స్వామి వారి ప్రతి రూపాలుగా ద్వాదశ స్తంభాలతో ఉండే వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. ఆ సమయంలో స్వామిని దర్శించుకుంటే కల్యాణం జరుగుతుందని నమ్మకం.

సప్తనారీ హంస వాహనం



సప్తనారీ హంస వాహనం

చిత్రరథుడు అనే గంధర్వుడు సంగీత ప్రియుడు. సంగీతానికి మూలమైన సరిగమ పదని అనే ఏడక్షరాల పేర్లతో ఏడుగురు కుమార్తెలకు జన్మనిచ్చాడు. ఆ ఏడుగురు కుమార్తెలు పరమ శివుడిని ప్రతినిత్యం కొలవడంతో శివుడు ప్రత్యక్షమయ్యాడు. తమ భుజస్కంధాలపై మిమ్మల్ని మోసే భాగ్యం కల్పించాలని వారు కోరగా అనుగ్రహించాడు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో తపసు చేయడం ద్వారా మాత్రమే ఆ వరం సాధమవుతుందని చెప్పడంతో వారు అలాగే చేసి స్వామి అనుగ్రహం పొందారు. దీంతో ఏటా మహాశివరాత్రి పర్వదినాలలో సప్తనారీ హంస వాహనంపై స్వామివారు ఊరేగుతారు.

కల్యాణం.. కమనీయం



పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల కల్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలను చేశారు. స్థానిక శ్రీ రామకృష్ణ వాసవీ కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఎదురు సన్నాహం నిర్వహించారు. గజవాహనంపై గ్రామోత్సవం అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, నగలతో అలంకరించారు. ఆ విగ్రహాలను కల్యాణ వేదికపై అధిష్టింపచేశారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వంగా గీత కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. వేద పండితులు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఘనపాఠి ఆధ్వర్యంలో అర్చకులు చెరుకుపల్లి వెంకటేశ్వరశర్మ పూజలు జరిపారు. రాత్రి 8.32 గంటలకు స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పులి నారాయణ మూర్తి, ఆలయ ఫెస్టివల్ కమిటీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో రూ.37.78 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ ప్రాంగణంలో కొంతకాలంగా నిలిచిపోయిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనానికి రూ.20.05 కోట్లు, ఎగ్జామినేషన్ భవనానికి రూ.8.25 కోట్లు, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ భవన నిర్మాణానికి రూ.1.90 కోట్లు, పార్కింగ్ షెడ్‌కు రూ.8.3 లక్షల చొప్పున రూ.30.28 కోట్లు వెచ్చించి పెండింగ్ పనులను పునఃప్రారంభించనున్నారు. ఈ పనులు ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరగనున్నాయి. యూనివర్సిటీకి అనుసంధానంగా ఉన్న కాకినాడలోని ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో రూ.4.5 కోట్లతో మహిళా వసతి గృహాన్ని, రూ.3 కోట్లతో రోడ్లను నిర్మించనున్నారు. వీటి పనులను వీసీ ఆచార్య కె.పద్మరాజు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

385 గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకుల శుభ్రం

అమలాపురం రూరల్: జిల్లాలోని 22 మండలాల పరిధిలో ఉన్న 385 గ్రామ పంచాయతీల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకులను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో బుధవారం శుభ్రం చేయించామని డీపీవో డి.రాంబాబు తెలిపారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగిందన్నారు. అన్ని ఓహెచ్‌ఆర్‌లను పంచాయతీ సిబ్బందితో సాయంలో శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశామన్నారు. ప్రజల అందరికీ పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు గ్రామ పంచాయతీల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ ప్రత్యేక కార్యక్రమం విజయవంతం చేసినట్లు తెలిపారు.

వివాహేతర సంబంధం కేసులో ఇద్దరికి జైలు

కాకినాడ లీగల్: వివాహేతర సంబంధం కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ఉషాలక్ష్మికుమారి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన పాము సుబ్రహ్మణ్యంతో అయినవిల్లి మండలం సిరిపల్లి గ్రామానికి చెందిన సుధారాణికి 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. సుబ్రహ్మణ్యం చెడు వ్యసనాలకు అలవాటు పడి మరో మహిళ నాగమణితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భార్యను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేశాడు. అలాగే సుబ్రహ్మణ్యం, నాగమణి కలిసి కాకినాడ రూరల్ మండలం గైగోలుపాడు సర్పవరం పరిధిలో రహస్యంగా కాపురం చేయసాగారు. ఆ విషయంపై సుధారాణి సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సుబ్రహ్మణ్యం, నాగమణిపై కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో ఇద్దరిపై నేరం రుజువు కావడంతో సుబ్రహ్మణ్యానికి మూడేళ్ల జైలు, రూ.4 వేలు జరిమానా, నాగమణికి నెల రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

26 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రైసుమిల్లులో పట్టుబడిన బియ్యంతో విజిలెన్స్ అధికారులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం తాపేశ్వరంలోని శ్రీ విఘ్నేశ్వర మోడ్రన్ రైస్ మిల్‌పై బుధవారం సివిల్ సప్లయిస్, విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. మండలంలోని వెలగతోడుకు చెందిన ఎరుబండి సురేష్ మోటారు సైకిల్‌పై సుమారు 120 కేజీల బియ్యాన్ని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తెల్లకార్డుదారుల నుంచి కిలో రూ.16కి బియ్యాన్ని కొనుగోలు రైస్‌మిల్లుకు రూ.20కి విక్రయిస్తున్నట్టు తేలిందని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. 26.787 టన్నుల పీడీఎస్ బియ్యంతో పాటు 50 క్వింటాళ్ల నూక, 724 క్వింటాళ్ల ధాన్యం, 124.30 క్వింటాళ్ల రంగుమారిన ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్లు నిర్వహిస్తున్న అనపర్తి మండలం రామవరానికి చెందిన కర్రి దత్తాత్రేయ గురుకృష్ణారెడ్డి, బియ్యాన్ని తరలించిన సురేష్‌లపై కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, విజయ్ కుమార్, జగన్నాథరెడ్డి, సీఎస్‌డీటీ అలీషా పాల్గొన్నారు.

టీ పొడి దుకాణాలపై విజిలెన్స్ దాడులు



టీ పొడి దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని టీపొడి తయారీ దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు బుధవారం దాడి చేశారు. టౌన్ హాల్ రోడ్డులోని రెండు టీ రీప్యాకింగ్ హోల్‌సేల్ షాపులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో నందిని టీ ట్రేడర్స్‌పై కేసు నమోదు చేశారు. రంగు మెరుగు కోసం నిషేధిత సింథటిక్ ఫుడ్ కలర్‌ను టీపొడిలో కలపడాన్ని గుర్తించారు. రెండు టీపౌడర్ ప్యాకెట్లను ల్యాబ్‌కు పంపారు. టీపొడిని కల్తీ చేయడానికి ఉపయోగిస్తున్న టార్ట్రాజైన్ (పసుపు) 1.423 కిలోలు, సన్ సెట్ పసుపు 4.119 కిలోలు, బ్రిలియంట్ బ్లూ 0.268 కిలోల సింథటిక్ రంగులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే టీ పొడి ప్యాకెట్లపై ప్యాకింగ్ వివరాలు, కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నందున వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. టీపొడిని కల్తీ చేసేందుకు సింథటిక్ రంగులను ఉపయోగించిన నేపథ్యంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. అనంతరం భారతి టీ ఎంటర్‌ప్రైజెస్‌ను తనిఖీ చేశారు. అక్కడ ప్యాకింగ్, కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడంతో లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేష్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Inter Bi.P.C. Pass! Join BPT (Doctor) & B.Sc. MLT Courses in Minerva, Prathipadu, Kakinada Dist., Dr. YSRUHS & APSAHP Council Recognised. ✆ : 73864 86669, 80741 36818 [R-253]

Real Estate

PLOT FOR SALE

■ కేవలం 7.5 లక్షలకే 25 సెంట్ల భూమి & 100 ఎర్ర చందనం మొక్కలతో స్పాట్ రిజి. చేయబడును. మీ పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా ఎర్రచందనం సాగు ఒక్కటే మార్గం. తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం. ✆ 96031 84207, 96661 66407 [B-2507]

Services

■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-6356]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338 [G-824357]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

ASTROLOGY

■ ఓం శక్తి జ్యోతిష్యాలయం: వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం, చదువు, ప్రేమ, పెళ్లి, సంతానం, విదేశీయానం, రాజకీయం, ధనం ఇంకా ఎటువంటి సమస్యలకైనా 9 రోజులలో శాశ్వత పరిష్కారం. వశీకరణ స్పెషలిస్ట్ గురూజీ: దుర్గాప్రసాద్ రాజు – 9849957621 [W-1200997]

Wanted

■ కాకినాడ మాడ్యులర్ కిచెన్ మరియు ఇంటీరియర్ డిజైనింగ్ కంపెనీ నందు పనిచేయుటకు అనుభవం కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. టూ వీలర్ తప్పనిసరి ✆ : 93464 19999 [R-1151710]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 89197 39694. [M-1167540]

■ ASM/DM/TL/Cashier/Sales Man Job Openings in a Retail Store at Centro Rajahmundry, Danavaipet. Ph: 8686683088, 7993527535 [H-787948]

■ కష్టలేన్ని కారు MP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 8317512185. [HA-1298]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. Ph: 9160900024/9840400073 [HA-1320]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13601]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233868]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ: 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 62812 08567, 92814 52827 [B-1239098]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

నాలుగు లైన్లకు రూ. : 400/-

అదనపు లైనుకు రూ. : 90/-

GST 5% Extra

సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.

ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వైభవంగా లూర్థుమాత యాత్రా మహోత్సవం



ఆర్‌సీఎం చర్చిలో భక్తుల రద్దీ



లూర్థుమాత

యానాం: యానాంలో ఫ్రెంచి పరిపాలన కాలంలో 1853లో నిర్మితమైన రోమన్ కేథలిక్ చర్చి ఆవరణలో లూర్థుమాత యాత్రా మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపునకు యానాం, జార్జిపేట, నీలపల్లి, ఇంజరం, కాజులూరు, తాళ్లరేవు మండలాల నుంచి, పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా మతాలకతీతంగా జనం తరలివచ్చారు. లూర్థుమాతను దర్శించుకున్నారు. ఫాదర్ బాలశౌరి, ఫాదర్ మరియదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా.. 1957 నుంచి పవిత్ర లూర్థుమాత ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ఏరోబిక్స్ తరగతులు



ఏరోబిక్స్ తరగతుల్లో పాల్గొన్న యువకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏరోబిక్స్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకూ శిక్షణ జరిగిందన్నారు. ప్రతి రోజూ సుమారు 2 వేల మంది క్రీడలు, వ్యాయామం, యోగా, పరుగు, నడక వంటి ఆరోగ్య కార్యక్రమాలు చేసుకునే వేదికగా ఆర్ట్స్ కళాశాల మైదానం నిలిచిందన్నారు. మనిషికి ఆరోగ్యానికి మించిన ధనం మరొకటి లేదన్నారు. పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి సుధాకర్, కోశాధికారి విజయలక్ష్మి తదితరులు మాట్లాడారు. అక్కడకు విచ్చేసిన వారందరికీ టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ గోపాలకృష్ణ, ముళ్ల మాధవ్, శిక్షకులు విజయ్, వీవీ లక్ష్మీ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులపై అవగాహన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలను ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ కృష్ణారావు బుధవారం సందర్శించారు. స్టడీసెంటర్ కో ఆర్డినేటర్ ఎంఆర్ గౌతమ్‌తో కలిసి ఆయన ఎస్‌కేవీటీ కళాశాల, ఎస్‌కేఆర్ మహిళా కళాశాలలకు వెళ్లారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లపై సమీక్షించారు. ఇగ్నోలో అందిస్తున్న సర్టిఫికెట్, డిప్లమో కోర్సులపై అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్‌ను సందర్శించి న్యాయవాదులకు ఇగ్నో అందిస్తున్న కోర్సులను వివరించారు. అలాగే అల్టర్నేట్ రెసొల్యూషన్‌పై సర్టిఫికెట్, డిప్లమో కోర్సు కార్యక్రమానికి ఇగ్నో కేంద్ర కార్యాలయానికి సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవ వసంతం మ్యాగజైన్ ఆవిష్కరణ



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణసంస్థ (డైట్)లో రూపొందించిన 2023–24 సంవత్సర మ్యాగజైన్ ‘ నవ వసంతం’ను బుధవారం విజయవాడలో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్.సురేష్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఛాత్రోపాధ్యాయులలో దాగిఉన్న వివిధ రకాల నైపుణ్యాలను వెలికి తీయటానికి ఇటువంటి మ్యాగజైన్ ఎంతో ఉపయోగపడుతుందని కమిషనర్ అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ మాట్లాడుతూ ఈ సంచికలో 2022–24 బ్యాచ్, 2023–25 బ్యాచ్ ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపక సిబ్బంది రాసిన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర విద్యావిషయక అంశాలతో అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు.

కడియపులంకలో ఆధ్యాత్మిక సందడి

కడియం: కడియపులంక గ్రామంలో బుధవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో మార్మోగింది. దశాబ్దాల చరిత్ర కలిగిన పాత పూల మార్కెట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం వార్షికోత్సవాన్ని ప్రతి ఏటా శివరాత్రికి ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలను బుధవారం నుంచి ప్రారంభించారు. వందల మంది ఆంజనేయస్వామి మాల ధరించి ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సంప్రోక్షణను నిర్వహించారు. ప్రజలంతా ఆరోగ్యం, సిరిసంపదలతో ఉండాలని కోరుతూ సప్తనదీ జలాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున మాలధారులు, నర్సరీ రైతులు, భక్తులు పాల్గొన్నారు. బాలరాముడి చిత్రపటంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏటా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి జాతర మహోత్సవం ఉంటుందన్నారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం రోజు భారీ అన్నసమారాధన జరుగుతుందని వివరించారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, వాడపల్లి

ఈ - టెండరు ప్రకటన

Dr. B.R.Ambedkar కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం యొక్క ఈ క్రింది పనులు నిమిత్తం టెండరు పిలవబడుచున్నది.

వ.సెం	పని వివరం	ఎస్టిమేట్ మొత్తం
1	Providing Granite Slab Flooring to Vasantha Mandapam	రూ.8,50,000/-
2	Improvements to Alwar Mandapam	రూ.5,10,000/-
3	Providing Stainless Steel Q Lines in Vasantha Mandapam	రూ. 9,00,000/-
4	Providing Granite Flooring and SS Q Lines to Sub Temple	రూ. 8,60,000/-

బిడ్ డాక్యుమెంట్ తేది.06/03/2024 ఉదయం 10.00 గంటల నుండి ది.12/03/2024 ఉదయం 10.00 గంటల వరకు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. టెండరు దాఖలు చేయుటకు ఆఖరి తేది.12/03/2024 ఉదయం 10.30 నిమిషములకు. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చును.

చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

సం/- డిప్యూటీ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

Dt: 06/03/2024

Place : Vadapalli